# భరత మాతా నీకు నమస్సులు--స్వాతంత్ర్యమా నీకు జోహార్లు



భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందీ అంటే దాని వెనుక మహాత్మాగాంధీ కృషి ఎంత వరకు ఉందో అందరికీ తెలిసిందే.. తెల్లదొరలని మన దేశంనుండివెళ్ళగొట్టడానికి అహింసాయుతంగా పోరాటం జరిపి, భారత దేశ జనాలని ఒకతాటిపైకి తీసుకువచ్చి ఇంగ్లీషువారికి బెంబేలెత్తించాడు ఆ మహాత్ముడు.. భరతమాతకు బిగించిన సంకెళ్లను పెళ్ళున విరిచి భారత జాతికి విముక్తి కలిగించాడు. 1947 ఆగష్టు 14 అర్థరాత్రి 12 గంటలకు భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సందర్భంగా ప్రజలందరూ ఎంతో ఉత్సాహంతో, సంతోషంతో పండగ జరుపుకున్నారు.. కానీ.. మహాత్మాగాంధీ మాత్రం స్వాతంత్ర్యం తెచ్చనందుకు సంతోషపడలేదు.. పైగా ఆ రోజు ఆయన అంతకంటే రెట్టింపు బాధలో ఉన్నారు. ఎందుకు..??

1947 ఆగష్టు 14 అర్థరాత్రి దాటింది... 15వ తేదీ ప్రవేశించింది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. లక్ష్యం సిద్దించిన ఆనందం అందరిలో తాండవిస్తోంది. సంబరాలు జరుపుకోవడంలో అంతా నిమగ్నమయ్యారు. ఏ మధుర క్షణాల కోసం సత్యాగ్రహం చేశారో.. ఏ ఆశయం కోసం తెల్లదొరల లాఠీ దెబ్బల రుచి చూశారో.. ఆ స్వేచ్ఛ సిద్దించినప్పుడు గాంధీజీ ఎక్కడున్నారు? ఏం చేస్తున్నారు? ఇవి ఆసక్తికరమైన ప్రశ్నలు. ఆ రోజున ఆయన సంబరాలు చేసుకోలేదు. ఆయన హృదయం ఆవేదనతో రోదిస్తోంది. కారణం.. దేశ విభజన, ఆ తర్వాత చోటుచేసుకున్న మత కలహాలు.

అప్పటి బెంగాల్‌లో... ఇప్పటి బంగ్లాదేశ్‌లో ఉన్న నవ్‌కాలి జిల్లా మతకలహాలతో అట్టుడుకుతోంది. నిజానికి 1946 నవంబరు నుంచి అక్కడ అలజడి మొదలైంది. హిందూ-ముస్లింల మధ్య ఘర్షణలు మొదలయ్యాయి. దేశవిభజన సమయానికి అవి మరింత పెచ్చరిల్లాయి. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సందర్భంగా అందరూ ఎంతో ఆనందడోలికలలో మునిగిన ఆ సమయంలో గాంధీ మహాత్ముడు ఈ సంఘటన వల్ల తీవ్రంగా బాధపడ్డారు. వెంటనే బయలుదేరి నవ్‌కాలి జిల్లాలో పర్యటించారు. నడి వీధుల్లో చెల్లా చెదురుగా పడిన మృతదేశాల మధ్య.. కాలి బూడిదవుతున్న నివాసాల మధ్య.. ఆ విశాద దృష్యాలని చూస్తూ ఎంతో చలించిపోయాడు ఇంకా అక్కడ విధ్వంసకాండలు చెలరేగడానికి అవకాశం ఉందని తెలిసికూడా ఆయన వాటి మధ్యలో నుండి నడుచుకుంటూ వెళ్లారు.. ఆవేశకావేశాలతో.. విచక్షణ నశించి.. దాడులు జరుపుతున్న వారిన లెక్క చేయుకుండా ముందుకు సాగారు. తెగించి కొనసాగించిన ఆయన పర్యటన కరుడు కట్టిన చాంధసులను కరిగించింది. హత్యలు, దాడులు, గృహదహనాలు అంతటఇతో ఆగిపోయాయి. నవ్‌కాలి శాంతించింది.. గాంధీని ఏవో కారణాలవల్ల ద్వేషించిన వారెందరో.. ఆ క్షణం నుంచి మారిపోయారు. స్వతంత్ర్యం వచ్చిన సమయంలో పదవులు, హోదాలు వద్దనుకుని.. ఓ మారుమూల ప్రాంతంలో శాంతి, సౌభ్రాతృత్వాల స్థాపనకోసం ఆయన చేసిన ప్రయత్నం చూసి చలించిపోయారు. ఓ విధంగా స్వాతంత్ర్య పోరాటం తర్వాత కూడా ఆయన సత్యాగ్రహ బాటలోనే నడిచారు. అందుకే మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ... మహాత్ముడయ్యారు..

నేడు 60 వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని.. మహాత్మా.. నీకు జోహార్లు..!!